క్లుప్తంగా

రామునాయుడికి ఎమ్మెల్యే పరామర్శ



రామునాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడును శుక్రవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు పెదిశెట్టి శేఖర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పోర్టు కార్మికుల దీక్షలు



దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం

మహారాణిపేట: ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పారిశుధ్య శాఖ విడుదల చేసిన సమాచారం ద్వారా రాష్ట్రంలో ఫ్లోరోసిస్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించేందుకు తీర్చిదిద్దిన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సమత, ఇతర వైద్యులు, ఎన్‌సీడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటైంది. చైర్మన్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కార్యదర్శిగా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ శివప్రసాద్, సభ్యులుగా విద్యాశాఖ ఏడీ జ్యోతి, ప్రాజెక్టు అధికారి సమత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతుడు యామలపల్లి లక్ష్మణరావు

కూర్మన్నపాలెం: విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం తాజంగి గ్రామానికి చెందిన యామలపల్లి లక్ష్మణరావు (28) కూర్మన్నపాలెంలో నిర్మితమవుతున్న ఎంవీవీ అండ్ ఎంకే పార్కు అపార్ట్‌మెంట్స్‌లో పది నెలలుగా ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అల్లిపురంలోని బంగారుమెట్టలో సోదరుడు యామలపల్లి రామకృష్ణ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విధులకు హాజరైన లక్ష్మణరావు ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై, ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి అన్నయ్య యామలపల్లి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండో రోజు కొనసాగిన వీఆర్‌ఏల దీక్షలు

పరవాడ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తమ సమస్యల సాధన కోసం వీఆర్‌ఏలు తహసీల్దారు కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి రెండో రోజుకు చేరాయి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, చైన్‌మెన్, వాచ్‌మన్, డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం



ముత్యాలమ్మపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



నాయుడుపాలెంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలకు డబ్బులిస్తేనే పథకాలు వచ్చేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటికే వస్తున్నాయని చెప్పారు. మేనిఫెస్టోను అమలు చేసిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. మత్స్యకార భరోసాను రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి జగనన్న ప్రభుత్వం మత్స్యకార్మికులకు అండగా నిలిచిందన్నారు. కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జనన, మరణ, ఆదాయ, కుల, వివాహ, రేషన్ కార్డు, ఫ్యామిలీ సర్టిఫికెట్ వంటి 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. పేదల పక్షాన నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రజలను కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం గ్రామాల్లో అర్హులకు ఎమ్మెల్యే ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, కోఆప్షన్ సభ్యుడు ఎం.అప్పన్న, మండల వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఇంటికే ప్రభుత్వ సేవలు



పెదనాయుడుపాలెంలో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

సబ్బవరం: లబ్ధిదారుల ఇంటికే నేరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు,సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు.మండలంలోని పెదనాయుడుపాలెం,గొర్లివానిపాలెం సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెదనాయుడుపాలెంలో సబ్బవరపు నాగభూషణం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్వతంత్ర భారతావనిలో ఇలాంటి సంక్షేమ పాలన ఏ రాష్ట్రంలో జరగలేదన్నారు. ఈ సందర్భంగా ఆమె పలువురి లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, జగనన్న సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము,సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,పాలిశెట్టి సురేష్ రాజ్, సబ్బవరపు ముత్యాలనాయుడు,ఎంపీడీవో రమేష్ నాయుడు,తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు అభిషేకం



వెంకన్నకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అలివేలు మంగమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

మంచినీటి సమస్యపై దృష్టి పెట్టండి



న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని న్యూహౌసింగ్ బోర్డుకాలనీలో మంచినీటి సమస్య పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు జీవీఎంసీ అధికారులకు సూచించారు. కాలనీలో మంచినీటి సమస్య ఉందని, ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఇటీవల కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముమ్మన దేముడు శుక్రవారం జీవీఎంసీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ప్రజల సమస్యలను అధికారుల సమక్షంలో వివరించారు. త్వరలోనే మంచినీటి సమస్యపరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. దీంతో కాలనీ వాసులు కార్పొరేటర్ ముమ్మనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌సప్లై ఏఈ రాజశేఖర్, నాయకులు కోరాడ చందుయాదవ్, జి.బుజ్జి, యలమంచిలి శ్రీను, ఆబోతు శ్రీను పాల్గొన్నారు.

ప్రత్యేక అలవెన్సులపై కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన బాట



కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ప్రత్యేక అలవెన్సుల కోసం ఆందోళనకు సిద్ధమవుతున్నారు. కాంట్రాక్టర్లు కార్మికులకు ఈ నెల జీతాలతో ఇవ్వాల్సిన ప్రత్యేక అలవెన్సులు ఇవ్వకపోవడాన్ని కాంట్రాక్టు కార్మిక సంఘాలు నిరసిస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఎల్‌ఎంఎం పార్కులో జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 5 వరకు రోజుకు మూడు విభాగాల చొప్పున ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు దిగ్బంధం చేయాలన్నారు. ఆగస్టు 11వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు కోక్ ఓవెన్స్ నుంచి అడ్మిన్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేయనున్నామని తెలిపారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే సమ్మె నోటీసు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో మంత్రి రవి, సోమరాజు, జి. శ్రీనివాసరావు, పి.వి. నగేష్, జి. సత్యారావు, ఉమ్మిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దొండపర్తి(విశాఖ దక్షిణ): సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించిన రోజునే మహిళా సాధికారత సాధ్యమని డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేరీ సుజాత కంటిపూడి పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా 'మహిళా సాధికారత, శిశు సంరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. లింగ సమానత్వాన్ని సాధించకుండా మహిళా సాధికారత సాధ్యపడదని చెప్పారు. ముఖ్యంగా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, మానసిక శ్రేయస్సుకు మహిళల్లో శారీరక సాధికారత కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రఫుల్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగరంలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఎండాడలో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

కొమ్మాది: నగరంలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్-2 పరిధిలోని ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పార్కులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సేద తీరేందుకు గాను, నగరంలో ప్రతీ ప్రాంతంలో పార్కులను అభివృద్ధి పరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలతో పాటు అన్ని వయసుల వారికి ఉపయోగపడే విధంగా ప్లేగ్రౌండ్, జిమ్, వాకింగ్ ట్రాక్ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు. ఎండాడ వైఎల్‌పీ లే అవుట్ ప్రాంతంలో పామ్ థీమ్ పార్కు పనులు సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో ప్రారంభించడం జరుగుతుందన్నారు. సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్లు సత్యనారాయణ రాజు, శ్యామ్‌సన్‌రాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీనివాస్, ప్రసాద్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మరిన్ని ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాలు



రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్‌ను కలిసిన జిల్లా ప్రతినిధులు

తగరపువలస: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ తరఫున త్వరలో జిల్లాలో మరిన్ని మెరుగైన ఫుట్‌బాల్ శిబిరాలు ఏర్పాటు చేసి, క్రీడాకారులను తయారుచేయనున్నట్టు జిల్లా ఉపాధ్యక్షుడు రాజారావు, కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. రాష్ట్ర శాప్ డైరెక్టర్, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డేనియల్ ప్రదీప్‌ను శుక్రవారం నగరంలో కలిసి, జిల్లాలో చేపడుతున్న క్రీడా కార్యక్రమాల గురించి వివరించారు. అందులో భాగంగా మరింత మందికి ఫుట్‌బాల్ క్రీడను చేరువ చేయనున్నట్టు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో అసోసియేషన్ కోచ్ శేషు మోహన్, కృష్ణ, సన్ని, రామకృష్ణ, ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10 వేల జరిమానా

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహన చోదకుడికి కోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపిన వివరాలిలా.. ఇటీవల ఎన్‌ఏడీ బ్రిడ్జి వద్ద చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి గూడ్స్ వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌ను పట్టుకున్నారు. ఆ వ్యక్తికి మూడో స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, ఇన్‌చార్జి 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వై.గణపతిరావు రూ.10 వేలు జరిమానా విధించారు. కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఏడు కేసులకు గాను మొత్తంగా రూ.31,000 జరిమానా వసూలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే తగిన మూల్యం చెల్లించక తప్పదని సీఐ హెచ్చరించారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గరికిపాటి ప్రవచనాలు ప్రారంభం



ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభిస్తున్న గరికిపాటి నరసింహారావు

సీతమ్మధార: అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మనుచరిత్ర గురించి ప్రసంగించారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై ప్రవచించారు. శని, ఆదివారాల్లో సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనాల కార్యక్రమం జరుగుతుందని, భక్తులు, అభిమానులు తరలిరావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ, కోశాధికారి కె.శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ పి.వి.కె.హనుమాన్‌రాజు, ఈసీ మెంబర్లు, విజయ నిర్మాణ్ సంస్థ అధినేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో పలువ్యాపారాలు నిర్వహించుకోవడానికి శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి కొన్ని, ముడేళ్ల కాలపరిమితితో కొన్ని లీజు హక్కులు కల్పించారు. హెచ్చు మొత్తంలో పాడిన వారికి అధికారులు షాపులు ఖరారు చేశారు. సింహగిరిపై భక్తులకు ఫొటోలు తీసేందుకు ఏడాదికి రూ. 26.33 లక్షలు, కాఫీ,టీల విక్రయానికి రూ.42వేలకు ఖరారు చేశారు.

సింహాచలం గురువారం సంతలో ఆశీలు వసూలుకు రూ.96వేలు, గోపాలపట్నం బుధవారం సంత మినహా మిగతా రోజుల్లో ఆశీలు వసూలుకు లక్షా 43వేలు, కేశ ఖండనశాల వద్ద షాపు అద్దె నెలకు రూ.38వేలకు పాటదారులు దక్కించుకున్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లోని 68వ దుకాణానికి నెలకు రూ. 37వేలు, కొండదిగువ పురూరవ బిల్డింగ్‌లోని 29, 32 దుకాణాలకు నెలకు రూ.12,500 చొప్పున, పాత ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఏడో నెంబర్ షాపునకు నెలకు రూ.10,400, ప్రహ్లాదపురంలోని షాపు నెంబర్ 8 నెలకు రూ.3 వేల అద్దెకు ఖరారు చేశారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏఈవోలు రమేష్, జంగం శ్రీనివాస్, సూపరింటిండెంట్ అప్పారావు, ఉద్యోగులు దొంతల రమణ తదితరులు వేలంపాటలు నిర్వహించారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



అమ్మవారికి హారతి అందజేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం ,మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విశేషంగా తిరువీధి

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం సింహవల్లీ తాయారు అమ్మవారికి తిరువీధి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో అధిష్టంపజేసి ఆలయ బేడామండపంలో సాయంత్రం తిరువీధి ఘనంగా నిర్వహించారు.విశేషంగా హారతులు అందజేశారు.

ఇంటింటా ఓటరు సర్వే ప్రారంభం

పరిశీలించిన ఆర్డీవో హుస్సేన్ సాహెబ్



పెందుర్తిలో ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: ఇంటింటా ఓటరు సర్వేకు ప్రజలంతా సహకరించాలని, 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ కోరారు.ఇంటింటా ఓటరు సర్వే శుక్రవారం పెందుర్తి మండలంలో ఘనంగా ప్రారంభమైంది. పలు ప్రాంతాల్లో జరిగిన ఈప్రక్రియను ఆయన పరిశీలించారు. ఓటర్లతో స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ నెల రోజులపాటు ఇంటింటా ఓటరు సర్వే జరుగుతుందన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక ప్రాధన్యం ఇస్తామన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

గొర్లివానిపాలెంలో..

సబ్బవరం:మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఓటరు జాబితా ఇంటింటి సర్వేను తహసీల్దార్ బి. సత్యనారాయణ పరిశీలించారు. వచ్చే నెల 21వ తేదీ వరకూ నెల రోజుల పాటు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే నిర్వహిస్తారన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: రాష్ట్ర ప్రజలందరి శ్రేయస్సు కోరి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం, గొన్నవానిపాలెం ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రేయోరాజ్య నిర్మాణం కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. ఆయనకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, గొన్నా విద్యా సంస్థల కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొన్న హేమచంద్ర నాయుడు, నాయకులు అమరపిని రమేష్, జి.శ్రీనివాసరావు, ఇ.శ్రీనివాసరావు, జి.వి.రమణ, జి.హరీష్, నక్కా హరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

సీతమ్మధార : మణిపూర్ మహిళలపై హింసకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మహిళా చేతన, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఐద్వా, పీవోడబ్ల్యు సంస్థల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై హింస, అత్యాచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థినులను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలకు తెగబడటం, కుకీ మహిళల మీద దాడులు చేసి రెండు వేల మంది సమక్షంలో వివస్త్రలను చేసి, సామూహికంగా అత్యాచారం చేయటం దారుణమన్నారు. నిందితులను తక్షణం శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ ఫోరంకు చెందిన వీఎస్ కృష్ణ, ఎం.లక్ష్మి, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, ఎస్ఎస్‌రాజు, సంతోష్, ఎల్.జె.నాయుడు, గౌతమ్, శ్రావణ విమలకుమారి, శాంతి, రమణి, అప్పలరాజు, వరలక్ష్మి, అప్పారావు, పలు మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారిని తోడ్కొని వెళ్లి అభిషేకాల అనంతరం పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.